AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

25-8-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 3


## విద్యుత్ సరఫరాలో అంతరాయం



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని వినాయక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు. భారీ వినాయకుల తరలింపు నేపథ్యంలో పులాంగ్ నుంచి దేవి టాకీస్ చౌరస్తా వరకు విద్యుత్ తీగల ఎత్తు పెంచడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, ఆర్మూర్ :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో అధికారులు వరద గేట్ల ద్వారా నీటి విడుదలను సైతం తగ్గించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీలోకి ప్రస్తుతం 41,867క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1090.90 అడుగులకు (80.05 టీఎంసీలు) చేరింది. ప్రాజెక్ట్‌లోకి వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు నీటి విడుదలను తగ్గించారు. ఆదివారం 8 గేట్ల ద్వారా గోదావరిలోని నీటిని వదిలిన అధికారులు సోమవారం నాలుగు గేట్లు మూసి వేశారు. ప్రస్తుతం నాలుగు గేట్ల ద్వారా 12,320 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,500 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 150, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ కు 231క్యూసెక్కులు వదులుతుండగా, 666 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతుంది. గోదావరి మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి నిర్మించిన వరద కాలువకు 20 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.




## పారిశుధ్య కార్మికుల భద్రతకు.. సంక్షేమానికి ప్రాధాన్యత

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే పారిశుధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. జిల్లాలో ఎక్కడా మాన్యువల్ స్కావెంజర్స్ లేరని 1993 నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రజిత కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. సఫాయి కర్మచార్యులు, పారిశుధ్య కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు అర్హులైన వారి పిల్లలకు ప్రీ మెట్రిక్స్ స్కాలర్‌షిప్స్ అమలయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రవిబాబు, సీపీవో రతన్ పాల్గొన్నారు.

నిజామాబాద్ కమిషనరేట్ పోలీసులు తాజాగా వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఏకకాలంలో రైడ్ చేసి పెద్ద మొత్తంలో నగదు, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిజామాబాద్ నగరంలోని ఓ చిట్‌ఫండ్‌లోనూ పోలీసులు సోదాలు జరిపారు. ఈ సంస్థలో భారీ మొత్తంలో నగదుతోపాటు అప్పులిచ్చి తనఖా పెట్టుకున్న డాక్యుమెంట్లు బయటపడ్డాయి. తదుపరిగా నాలుగో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

- అక్షరటుడే, ఇందూరు




# చిట్‌ఫండ్ ముసుగులో వడ్డీ దందా..

- అడ్డంగా దొరికిన వ్యాపారి
- కోట్ల రూపాయలు మిత్తీకి ఇచ్చిన వైనం
- పోలీసుల తనిఖీల్లో లభ్యమైన ఆస్తి పత్రాలు

నిజామాబాద్ కేంద్రంగా ఓ చిట్‌ఫండ్ సంస్థ గత కొన్నేళ్లుగా కార్యకలాపాలు సాగిస్తోంది. అయితే చిట్‌ఫండ్ నిర్వహణకు అనుమతులు తీసుకుని, అధిక వడ్డీలకు ఫైనాన్స్ ఇస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వెళ్లాయి.

ఈ నేపథ్యంలోనే శనివారం (ఆగస్టు 23) సదరు సంస్థకు చెందిన కార్యాలయంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో రూ. 1.04 కోట్ల నగదు, అప్పు కింద తనఖా పెట్టుకున్న 15కు పైగా ఆస్తి పత్రాలు లభించాయి. వాటిని సీజ్ చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు. అయితే పోలీసులు తనిఖీలు చేపట్టిన సమయంలో నిర్వాహకులు.. నగదు చిక్కకుండా డబ్బు కట్టలను బయటకు విసిరేశారు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు మొత్తం నగదును సీజ్ చేసి, పంచుల సమక్షంలో పంచనామా పూర్తి చేశారు.

### ఆస్తులు తాకట్టు పెట్టుకుని అప్పుల మంజూరు..

ఈ చిట్‌ఫండ్ కంపెనీ నిర్వాహకులు పోలీసులకు అడ్డంగా దొరికినట్లు తెలుస్తోంది. పలువురి ఆస్తి తాలుకా పత్రాలను కుదవ పెట్టుకోవడంతోపాటు మరికొందరి ఆస్తులను నేరుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ తర్వాతే కోట్లాది రూపాయలను అప్పుగా పెద్దమొత్తంలో వడ్డీకి ఇచ్చినట్లు సమాచారం.

ఇందుకు సంబంధించిన పత్రాలలో లిఖిత పూర్వకంగా రాసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో ఈ కేసును మరింత లోతుగా విచారణ చేయించాలని కమిషనరేట్ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.



### వదిలిపెట్టాలని పైరవీలు..

చిట్‌ఫండ్ సంస్థపై పోలీసులు రైడ్ చేసిన అనంతరం కేసు నమోదు కాకుండా తప్పించుకునేందుకు కంపెనీ నిర్వాహకులు పెద్ద ఎత్తున పైరవీలు చేశారు. ఉన్నత సామాజిక వర్గానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నేరుగా రంగంలోకి దిగి, అక్కడే తిష్ట వేసినట్లు సమాచారం. తనకున్న పరిచయాల ద్వారా అధికార కాంగ్రెస్ ముఖ్య నేతలతో పోలీసు అధికారులపై తీవ్ర ఒత్తిడి చేయించినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలతోపాటు బీజేపీ ముఖ్యులతో కూడా ఒత్తిడి తెచ్చినా.. పోలీసులు తలొగ్గలేదని తెలిసింది. ప్రత్యేకించి సీపీ సాయి చైతన్య ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా వడ్డీ వ్యాపారుల దందా కేసులను పారదర్శకంగా పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. కాగా, చిట్‌ఫండ్ ముసుగులో వడ్డీ దందా నిర్వహించడంపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



## తెయూ లా కాలేజీలో వర్క్ షాప్

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ విశ్వ విద్యాలయ న్యాయ కళాశాలలో సోమవారం చట్టాల విశ్లేషణ, విమోచన అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా రిటైర్డ్ జడ్జి డి హేమంత్ కుమార్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై, కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో అధికార, ధన, బంధుప్రీతికి అతీతంగా ప్రజాస్వామ్య బద్ధంగా పరిపాలన కొనసాగాలని చట్టాలు సూచిస్తాయన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం కుల, మత, వర్గ, వర్ణ తేడా లేకుండా చట్టం దృష్టిలో అందరూ సమానమని పేర్కొన్నారు. చట్టాలపై విశ్లేషణతో పాటు ఏ సందర్భాల్లో చట్టాలు వివేచనకు గురవుతాయో వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు వివరణాత్మకంగా సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె. ప్రసన్న రాణి, డా స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు ఫింగర్ ప్రింట్ సెట్స్ అందజేత




**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలోని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు కొత్త మొబైల్స్ మంత్ర ఫింగర్ ప్రింట్ సెట్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు మొత్తం 211 సెట్స్ వచ్చాయని తెలిపారు. వీటిని ఉపయోగించి ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరికైనా ఫేస్ రికగ్నైజేషన్ రాకపోతే మంత్ర డివైస్ ఫింగర్ ప్రింట్ ద్వారా పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. బాన్సువాడలో సోమవారం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఊరూరా, కాలనీవారీగా ఏర్పాటయ్యే మండపాల్లో శాంతి భద్రతలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, పోలీసులు సూచించే మార్గదర్శకాలు పాటించాలని తెలిపారు. ఎవరికీ ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ విఠల్ రెడ్డి, సీఐలు అశోక్, తిరుపతయ్య, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల సస్పెన్షన్

**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ మెడికల్ కళాశాల లో జూనియర్‌ను ర్యాగింగ్ చేసిన విద్యార్థులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు ఇంటెన్స్‌ను ఆరు నెలలపాటు సస్పెన్షన్ చేయడంతో పాటు హాస్టల్ నుంచి శాశ్వతంగా తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ర్యాగింగ్ ఘటనపై ప్రిన్సిపల్ అధ్యక్షతన యాంటీ ర్యాగింగ్ కమిటీ సోమవారం ఉదయం సమావేశమైన విషయం తెలిసిందే. ఘటనపై ఇరువర్గాల వాదనలను వినడంతో పాటు జుడా మెంబర్‌తో మాట్లాడిన అనంతరం సస్పెండ్ చేశారు. అంతేకాకుండా తదుపరి చర్యలపై పోలీస్ శాఖ సమర్పించిన నివేదిక మీద చర్యలు తీసుకోనున్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో అడిషనల్ కలెక్టర్, డీసీపీ, జీజీహెచ్ సూపరింటెండెంట్, అడిషనల్ సూపరింటెండ్, వైస్ ప్రిన్సిపల్, అకడమిక్, డ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్, వివిధ శాఖల అధిపతులు హాజరయ్యారు.

### ర్యాగింగ్‌కు పాల్పడడం నేరం


ర్యాగింగ్‌కు పాల్పడడం నేరమని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కరరావు అన్నారు. నిజామాబాద్ మెడికల్ కళాశాలను సోమవారం సందర్శించారు. రెండు రోజుల క్రితం కళాశాలలో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్‌కు పాల్పడకుండా కమిటీ ప్రతినిధులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అవగాహన కార్యక్రమాలతో పాటు వాల్ పోస్టర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే లీగల్ సెల్ 9440901057కు సంప్రదించాలని సూచించారు. జడ్జి వెంట లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ రాజ్ కుమార్ సుబేదార్, బాలాజీ, విశ్వక్ తదితరులున్నారు.

# రాహుల్ గాంధీ బ్రెయిన్ చోరీ అయ్యింది..

- అందుకే ఓటు చోరీ డ్రామా..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు




**అక్షరటుడే, ఇందూరు:** కాంగ్రెస్ నేత అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ బ్రెయిన్ చోరీ అయిందని.. అందుకే ఓటు చోరీ అంటూ కొత్త డ్రామాకు తెరలేపారని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో లేరని.. యావత్ ప్రజానీకం మోదీ వెంటే ఉందని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో సోమవారం నిర్వహించిన బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లోనే కాదు.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి ఖాయమన్నారు. తమ పార్టీ మత పరమైన రిజర్వేషన్లకు దూరంగా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ అందులో 10 శాతం ముస్లింలకు కేటాయించడం సిగ్గుచేటన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి చెందుతుందని అర్థమయ్యే ఎన్నికలను ఆలస్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అనేక పథకాల్లో కేంద్ర వాటా ఉందని విషయాన్ని ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో మార్పు కావాలని ప్రజలు కూడా ఆకాంక్షిస్తున్నారన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. తొందరలోనే భారీ మార్పు కనిపిస్తుందని తెలిపారు. పార్టీలో కొత్తవారికి అవకాశం ఉంటుందని.. యువత మహిళలు పెద్ద ఎత్తున చేరాలని రాం చందర్ రావు అన్నారు. నిజామాబాద్ పార్లమెంటు అంటేనే బీజేపీకి తిరుగులేని స్థానమన్నారు. నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తే జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని బీజేపీ గెలుస్తుందన్న నమ్మకం కలిగిందన్నారు. పార్టీకి కార్యకర్తలే సంపద అని.. అటువంటి సంపదను ఎంపీ ధర్మపురి అర్వింద్ పూర్తి శాతం పోగుచేసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తూ పాలన కొనసాగిస్తుందన్నారు. కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పసుపు బోర్డు జాతీయ ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, నాయకులు లోక భూపతిరెడ్డి, పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతన్కర్ లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ ధర్మపురి అర్వింద్ తన పుట్టినరోజును పురస్కరించుకొని పార్టీ కార్యకర్తలకు చెక్కులను పంపిణీ చేశారు. నూతన గృహప్రవేశాలు చేసిన వారికి, అనారోగ్యం పాలైన వారికి చెక్కులను అందజేశారు. అలాగే జర్నలిస్టులకు బీమా సౌకర్యం కల్పించారు.







## పీఈటీని నియమించాలని ధర్నా

**అక్షరటుడే, కామారెడ్డి :** 'రెండున్నరేళ్లుగా మాకు పీఈటీ ఉపాధ్యాయుడు లేడు. ఇక్కడున్న ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై హైదరాబాద్ పంపించారు. మాకు క్రీడలు ఆడించే వారే లేరు. వెంటనే మా ఉపాధ్యాయుడిని మాకు పంపించండి' అంటూ కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి బాలుర పాఠశాల విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఆదర్శ పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలో శివరాం అనే వ్యాయమ ఉపాధ్యాయుడు గతంలో విదులు నిర్వర్తించేవారన్నారు. అయితే అతడిని రెండున్నరేళ్ల క్రితం ఇక్కడి నుంచి హైదరాబాద్ డిప్యుటేషన్ వేశారని వివరించారు. దీంతో ఆయన అక్కడే ఉంటున్నారని.. కానీ వేతనం మాత్రం ఈ పాఠశాల నుంచే పొందుతున్నాడని తెలిపారు. దీంతో ఈ పాఠశాల విద్యార్థులు క్రీడలు లేక చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్, డీఈవోలను కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో నియమింపబడిన ఉపాధ్యాయుడు ఇక్కడనే పనిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.




## గొర్రెల కాపరులను కలిసిన మాజీ ఎమ్మెల్యే

**అక్షరటుడే, నిజాంసాగర్:** బిచ్కుంద మండలం గుండెకల్లూరు గ్రామాన్ని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సోమవారం సందర్శించారు. ఈ మేరకు గ్రామంలో వరద తర్వాత పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే ఇటీవల వరదలో చిక్కుకుని బయటపడ్డ గొర్రెల కాపర్లతో ప్రత్యేకంగా ఆయన మాట్లాడారు. కాగా.. హన్మంత్ షిండేతో గొర్రెల కాపర్లు మాట్లాడుతూ.. ఎలాంటి సమాచారం లేకుండా అర్ధరాత్రి వరద నీరు ఒకేసారి రావడంతో తాము వరదలో చిక్కుకున్నామని వివరించారు. నీళ్లనీ ఒక్కసారిగా చుట్టుముట్టడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు చివరకు తమను రక్షించారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ నాల్చర్ రాజు, బస్వారాజ్ పటేల్, మాజీ సర్పంచ్ సంగీత, సాయి గొండ, సంజు పటేల్, హన్మాండ్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కామారెడ్డి జిల్లా రైతుబంధు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు డాక్టర్ దుద్దాల అంజిరెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఉన్న పరిస్థితులపై చర్చించారు. మాజీ మంత్రితో పాటు పార్టీ సీనియర్ నాయకులు షేక్ జుబేర్, మోచి గణేష్, చందర్ తదితరులున్నారు.



## కూల్‌డ్రింక్ షాప్‌లో మద్యం విక్రయం..

**అక్షరటుడే, నిజాంసాగర్ :** కిరాణా దుకాణాల్లో, బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఇష్టారీతిన వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు తిమ్మానగర్ రోడ్డు పక్కన ఉన్న సాయి కూల్‌డ్రింక్ షాప్ పై ఆదివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.దాడుల్లో 118 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే, దాబాలలో మద్యం సిట్టింగులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై వెంకట్రావు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.







## బీజేపీలో నూతనోత్సాహం..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్ రావు నియామకమైన తర్వాత ఇందూరుకు తొలిసారిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి, ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈమేరకు నగరంలో భారీర్యాలీ నిర్వహించారు. బూత్‌స్థాయి, పదాధికారుల సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దీంతో బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ఇందల్వాయి

## ఉచిత లడ్డూ పోస్టర్ల ఆవిష్కరణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కాంగ్రెస్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండలంలోని ప్రతి గణేష్ మండపానికి ఉచిత లడ్డూ పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చేతుల మీదుగా కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గణేష్ మండపానికి ఉచిత లడ్డూ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, ఎన్ఎస్‌యూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లకు కమిషన్ విడుదల చేయాలి



**అక్షరటుడే, లింగంపేట:** రేషన్ డీలర్లకు ఐదు నెలల నుంచి కమిషన్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం లింగంపేట తహశీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డీలర్లకు ఒకేసారి కమిషన్ విడుదల చేసి ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిషన్, నయీం, రమేష్, వెంకటేశం, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సోదర భావంతో పండుగలు జరుపుకోవాలి



**అక్షరటుడే, డోంగ్లి:** గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, ఈద్ ఉన్ మిలాద్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాని డోంగ్లి తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలో సోమవారం మత పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. గణేష్ ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నిమర్జన శోభాయాత్ర శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మద్నూర్ ఎస్సై విజయ్ కొండ, ఆర్ఐ సాయిబాబా, నాయకులు శశాంక్ పటేల్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



**అక్షరటుడే, కామారెడ్డి:** అధికారుల వేధింపులు తట్టుకోలేకపోతున్నామని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బంధువులు చనిపోయారని అధికారులను సెలవు అడిగితే చావులో శవంతో ఫొటో దిగి పంపాలని అడుగుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆశా వర్కర్లు కలెక్టరేట్‌ను ముట్టడించారు. దాంతో కలెక్టరేట్ వద్ద బారికేడ్లు పెట్టి ఆశాలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆశా వర్కర్లు మాట్లాడుతూ.. జిల్లాలో వైద్యాధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, తమపై వారికి కాకుండా తమకు పనులు చెబుతున్నారని వాపోయారు. అధికారుల పర్యటనల సమయంలో రాత్రి వరకు ఉండాల్సి వస్తోందని, ఒకవేళ ఉండకపోతే మెమోలు ఇవ్వడానికి సిద్ధంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల పర్యటన సమయంలో ఏఎన్ఎంలు ఉండడం లేదని,



## నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

**అక్షరటుడే, భీమ్‌గల్:** బాల్కొండ మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇటీవల ఏర్పాటు చేశారు. కాగా ఆ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆర్మూర్ డీఈ పీవీ రాజేశ్వర్ రావు సోమవారం ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడానికి 3.15 ఎంవీఏ స్థానంలో 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌టీడీఈడీ వెంకట్, డి.వెంకట్ రమణ, పెర్కిట్ ఏడీఈ శ్రీనివాస్, ఎంఆర్టీ ఏడిఈ నట్రాజ్, బాల్కొండ ఏఈ ఎస్.కిషన్, సబ్ ఇంజినీర్ మహేష్, ఎస్ఎల్ఐ కె సుందర్ రావు పాల్గొన్నారు.

## సంగెంలో ఉచిత వైద్యశిబిరం



**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం సంగెం గ్రామంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కోనేరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బాన్సువాడ బీజేపీ నాయకుడు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ సహకారంతో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాంప్ ఏర్పాటు చేశారు. మెగా హెల్త్ క్యాంప్‌నకు చుట్టుపక్క గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల అభివృద్ధి కోసం విరాళం

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని రాంసాగర్ తండాలో పాఠశాల అభివృద్ధి కోసం మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి సోమవారం రూ.20,000 విరాళం అందించారు. అలాగే తండా ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి చదివించాలని సూచించారు. కార్యక్రమంలో దామ సుమన్, రోహిత్ గౌడ్, ఎడ్ల శ్రీనివాస్, నవీన్ గౌడ్ తండా వాసులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి దరఖాస్తుల స్వీకరణ

**అక్షరటుడే, ఆర్మూర్:** రైతుల కోసం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై పరికరాలు అందించనున్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ సోమవారం నుంచి ప్రారంభమైందని ఆలూరు వ్యవసాయ అధికారి రాంబాబు తెలిపారు. జిల్లాకు మొత్తం 6,742 యూనిట్లు కేటాయించగా, మొదటి విడతగా రూ.1.67 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ పథకం కింద 11 రకాల వ్యవసాయ పరికరాలకు సబ్సిడీ వర్తించనుందని చెప్పారు. ఐదెకరాల్లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 40శాతం సబ్సిడీ లభించనుందన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. గతంలో లబ్ధి పొందని రైతులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

## న్యూసెన్స్ కేసులో నలుగురికి జైలు శిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** న్యూసెన్స్ చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన నలుగురికి న్యాయస్థానం నాలుగు రోజుల జైలు శిక్ష విధించింది. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 23న అర్ధరాత్రి బస్టాండ్ ఎదురుగా ఉన్న సాయి మెస్‌లో నగరానికి చెందిన జంగిటి విశాల్, బజ్జుల్వర్ గోవింద్, సందనాల సాయికుమార్, కాలే నవనాథ్ న్యూసెన్స్ చేసి శాంతి భద్రతలకు ఆటంకం కలిగించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని సిటీ పోలీస్‌యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం వారిని స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా ఒక్కొక్కరికి నాలుగురోజుల చొప్పున జైలుశిక్ష విధించారు.

## వంతెన వద్ద ఆటో బోల్తా

**అక్షరటుడే, ఇందల్వాయి:** ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఇందల్వాయి మండలంలో చోటు చేసుకుంది. ఇందల్వాయి నుంచి ధర్పల్లి వైపు వెళ్తున్న ఆటో మండలంలోని లింగాపూర్ వంతెన వద్ద ప్రమాదవశాత్తు రోడ్డు కిందికి జారి పడిపోయింది. దీంతో అందులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. అమ్రాద్ గ్రామానికి చెందిన వీరు ఆటోలో బ్రెడ్ ప్యాకెట్లు తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.



## శ్రద్ధానంద్ గంజ్‌లో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని గంజ్ మార్కెట్‌లో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున శ్రద్ధానంద్ ఏరియా ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి (37) షెడ్డలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గమనించిన కూలీలు వెంటనే మూడో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే మూడో టౌన్ పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

## ఇద్దరు యువకుల దారుణ హత్య..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మాక్లూర్ మండలంలో దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరానికి చెందిన జీలకర ప్రసాద్, అతడి స్నేహితుడు ఇద్దరు కలిసి ఆదివారం అర్ధ రాత్రి మాక్లూర్ మండలంలోని ధర్మోరా గ్రామానికి వెళ్లారు. అక్కడే ఇద్దరు హత్యకు గురయ్యారు.

నగరంలోని గౌతమ్ నగర్‌కు చెందిన ప్రసాద్ గతంలో ఓ పెట్రోల్ బంకులో పనిచేసేవాడు. ఇతడికి ధర్మోరా గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రసాద్ గ్రామానికి రాగా.. అతడితో పాటు ఆయన స్నేహితుడిని స్థానికులు దొరకబట్టుకుని చితకబాదినట్లు తెలుస్తోంది. తాళ్లతో బంధించి, తీవ్రంగా కొట్టినట్లు తెలుస్తోంది. ప్రసాద్‌తో వివాహేతర సంబంధం కలిగిన మహిళ బంధుమిత్రులు కలిసి యువకులను హతమార్చినట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రసాద్, అతడి మిత్రుడు గ్రామంలోకి రాగానే పక్కా ప్లాన్ ప్రకారం.. ఇరువురిపై దాడికి పాల్పడ్డారు. యువకుల కంట్లో కారం చల్లి, ఇనుప రాడ్‌తో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రసాద్ అక్కడికక్కడే మరణించగా.. అతడి స్నేహితుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాలను జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## తాగునీటి ట్యాంకును శుభ్రం చేసిన జీపీ సిబ్బంది

నిజాంసాగర్ మండలం ఆరేపల్లిలో 'అపరిశుభ్రంగా తాగునీటి సరఫరా' శీర్షికతో 'అక్షరటుడే'లో ఈనెల 22న కథనం ప్రచురిచమైంది. దీంతో జీపీ సిబ్బంది స్పందించారు. తాగునీటి ట్యాంక్‌తో పాటు బోరుబావిని సైతం శుభ్రం చేయించారు. అంతేకాకుండా సమీపంలో బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రంగా చేయడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

- అక్షరటుడే, నిజాంసాగర్




రిజిస్ట్రేషన్ల శాఖ ఎన్నిరకాల పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా సబ్ రిజిస్ట్రార్ల తీరు మాత్రం మారట్లేదు. ఇటీవల పలువురు సబ్ రిజిస్ట్రార్లు ఏసీబీకి చిక్కారు. మరికొందరు ఇష్టారాజ్యంగా డాక్యుమెంట్లు చేస్తున్నారు. ఇంకొందరైతే అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఓ డాక్యుమెంట్ క్యాన్సిలేషన్ వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది.

- అక్షరటుడే, నిజామాబాద్




# నిబంధనలకు విరుద్ధంగా జీపీఏ డాక్యుమెంట్ రద్దు..

▸ ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ నిర్వాకం ▸ విషయం బయటకు పొక్కకుండా తొక్కిపెట్టే ప్రయత్నం

ఆర్మూర్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి 2024లో 4,350 గజాల తన స్థలాన్ని ముగ్గురు వ్యక్తులకు జీపీఏ చేశాడు. దాదాపు రూ. నాలుగైదు కోట్లు విలువల చేసే ఈ స్థలాన్ని ముగ్గురు వ్యక్తులు జీపీఏ చేసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. సదరు జీపీఏ డాక్యుమెంట్ తాజాగా ఉన్నఫలంగా రద్దయ్యింది. ఈ విషయమై ముగ్గురు హక్కుదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఆరాతీయగా అసలు విషయం తెలిసి షాక్‌కు గురయ్యారు.

### హక్కుదారులు లేకుండానే క్యాన్సిలేషన్..

రిజిస్ట్రేషన్ల శాఖ నియమ నిబంధనల ప్రకారం.. ఏదైనా డాక్యుమెంట్ ఒకసారి జరిగితే తిరిగి ఇష్టారాజ్యంగా కాన్సిలేషన్ చేయడానికి వీలుండదు. అమ్మిన వారు, కొన్న వ్యక్తులు ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. సబ్ రిజిస్ట్రార్లు, ఆపై స్థాయి అధికారులకు సైతం క్యాన్సిలేషన్‌కు సంబంధించి ఎలాంటి అధికారాలు లేవు. కానీ, ఆర్మూర్ కార్యాలయంలో మాత్రం సబ్ రిజిస్ట్రార్ మహేందర్ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా జీపీఏ డాక్యుమెంట్‌ను క్యాన్సిల్ చేయడం అక్రమానికి అద్దం పడుతోంది.

ఈ ఏడాది జులై 5వ తేదీన బుక్ 1లో నమోదు చేసి డాక్యుమెంట్ నంబరు 4205/2025 పేరిట భూమి క్యాన్సిలేషన్ జరిగినట్లు దస్తావేజు పూర్తి చేశారు. నిజానికి గతంలో బుక్ 1లో వివరాలు నమోదై జీపీఏ హక్కులు కలిగి ఉన్న వారు లేకుండానే.. కేవలం గతంలో జీపీఏ చేసిన వ్యక్తితో క్యాన్సిలేషన్ చేయడం గమనార్హం. ఈ విషయమై సంబంధిత వ్యక్తులు కార్యాలయంలో ఆరాతీసినా, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. స్థానిక కాంగ్రెస్ నేత అండతోనే ఈ తంతు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

ఈ విషయం బయటకు పొక్కకుండా పెద్దఎత్తున నగదు చేతులు మారినట్లు సమాచారం. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ వ్యవహారంపై సత్వరమే చర్యలు తీసుకోవాల్సిన డీఐజీ కార్యాలయం అధికారులు సైతం ముడుపులు తీసుకుని మౌనం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇంతకీ వ్యవహారం రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ వరకు వెళ్లిందా..? లోలోపలే తొక్కిపెట్టారా..? అన్నది అంతుచిక్కని విషయం.

## రోడ్డు వేయించండి సారూ..



**అక్షరటుడే, గాంధారి:** తమ వీధిలో రోడ్డు వేయాలని గాంధారి మండల కేంద్రంలోని నరేందర్ కాలనీవాసులు కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ రేణుక చవాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. తమ కాలనీకి రోడ్డు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతోందని వివరించారు. వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు..




**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని గోన్ గొప్పుల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయ కులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో దేశ బోయిన సత్యనారాయణ, కొమ్ము మల్లేష్, కేతవత్ రాజ్ కుమార్, మాలవత్ జగన్‌తో పాటు వారి అనుచరులు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ పురోగతిని దృష్టిలో ఉంచుకొని పార్టీలో చేరినట్లు తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వంలో పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొదిరే స్వామి, మాజీ ఎంపీపీ కన్న సురేందర్, డీసీసీ డెలిగేట్ కుంట రమేష్, ముచ్కూర్ సహకార సంఘం ఛైర్మన్ బంగ్లా దేవేందర్, సేవలాల్, అనంతరావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన బస్టాండ్ నిర్మించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థలో చేరుకున్నందున నూతన భవనాన్ని నిర్మించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సోమవారం డిపో మేనేజర్ సరితా దేవికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరిందన్నారు. పాత భవనాన్ని కూల్చివేసి నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని కోరారు. బాన్సువాడ బస్టాండ్‌కు ప్రయాణికుల రద్దీ ఎక్కువ కావడంతో బస్టాండ్ లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కొత్త బస్టాండ్ కోసం ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఉమేష్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి రాజు, గజ్జల మహేష్, రామకృష్ణ, కొండని గంగారం, నాగరాజు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ కుమార్తె నిశ్చితార్థ వేడుకలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** జుక్కల్ మండల మాజీ ఎంపీపీ నీలు పటేల్ కూతురి నిశ్చితార్థ వేడుకలు సోమవారం మహారాష్ట్రలోని ముఖేడ్ పట్టణంలో జరిగాయి. కార్యక్రమానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే , ఉమ్మడి జిల్లాల జెడ్పీ మాజీ ఛైర్మన్ దఫేదార్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట నాయకులు రాజు, శ్రీహరి, విజయ్, గంగాధర్ తోపాటు మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** పాఠశాలల అభివృద్ధికి హెచ్ఎంలు కృషి చేయాలని ఎంఈవో రాజేశ్వర్ పేర్కొన్నారు. బాల్కొండ మండలం కిసాన్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎంగా కృష్ణవేణి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామస్థులు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా, నాణ్యమైన విద్య అందించేలా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు షేక్ రహీముద్దీన్, ఆర్ శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా నాయకులు రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






కోటగిరి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలను తప్పించే క్రమంలో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు మీదుగా ఓవర్‌లోడ్‌తో వాహనాలు వెళ్తుండడంతో భారీగా గుంతలు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- అక్షరటుడే, కోటగిరి

# రాష్ట్ర కమిటీలో మా వాటా పదవులు కావాల్సిందే..

**అక్షరటుడే, ఇందూరు:** బీజేపీకి ఇందూరు పార్లమెంట్ పరిధిలో ఎంతో బలం ఉందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. 2019, 2024 ఎన్నికల ఆ విషయం నిరూపితమైందని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ ఎక్కడుందని 2019లో కేసీఆర్ కూతురు కవిత ప్రశ్నించారని.. నాడే ఇందూరు ప్రజలు తెలిసేలా చేశారని వ్యాఖ్యానించారు. ఈ ప్రాంతం నుంచి ఓట్లిచ్చినం.. సీట్లిచ్చినమని.. రాష్ట్ర కమిటీలో మా వాటా పదవులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కోరారు. ఎక్కడైతే పార్టీకి బలం ఉంటుందో అక్కడ పదవులు కచ్చితంగా ఇవ్వాలన్నారు. నిజామాబాద్ నగరంలో సోమవారం నిర్వహించిన ఇందూరు, జగిత్యాల జిల్లా పార్టీ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో తన నియోజకవర్గ పరిధిలో బీజేపీకి 48 శాతానికి పైగా ఓట్లు వచ్చాయన్నారు. బాల్కొండ, ఆర్మూర్, కోరుట్ల, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో 51 శాతానికి పైగా ఓట్లు సాధించామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జగిత్యాల నియోజవర్గంలో కూడా 50 శాతం దాటుతాయన్నారు. తన పార్లమెంట్ పరిధిలోని కార్యకర్తలకు రాష్ట్ర నాయకత్వంలో చోటు కల్పించాలని కోరారు. పార్టీ అభివృద్ధి.. కొత్తవారికి అవకాశం ఇచ్చే బాధ్యత రాష్ట్ర అధ్యక్షుడిదన్నారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని.. తామంతా వెన్నంటి ఉంటామని హామీ ఇచ్చారు. గత ఎన్నికలకు ముందు రాకేశ్ రెడ్డి బీజేపీ చేరేసమయంలో పార్టీలోని కొందరు పెద్దలు అడ్డుకున్నారని వ్యాఖ్యానించారు. అనవసర పుకార్లు పుట్టించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ విషయమై పార్టీ అధిష్టానం దృష్టిగా తీసుకెళ్లి.. రాకేశ్ రెడ్డి చేర్చుకుని ఎమ్మెల్యేగా గెలిపించుకున్నామన్నారు. పుకార్లు సృష్టించిన నేతలే గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించారు. ఇప్పటికీ రాష్ట్ర జిల్లా కమిటీలో అలాంటి సీనియర్లకే పదవులు ఇస్తున్నారంటూ ఎంపీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కొత్తవారికి అవకాశం కల్పించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

పార్టీ ఎదుగుదలను అడ్డుకునే వారికి తాను ఎప్పుడు వ్యతిరేకంగానే మాట్లాడతానని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడంలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా డబుల్ బెడ్‌రూం మంజూరు చేయలేదని పేర్కొన్నారు. అలాంటి మా కార్యకర్తల కోసం ప్రభుత్వం తీసుకురావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మొట్టమొదటి జిల్లా పరిషత్, మున్సిపల్ ఛైర్మన్ గెలుపు ప్రకటన నిజామాబాద్ నుంచే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హైదరాబాద్ మినహా 31 మంది కార్పొరేటర్లు ఉంటే.. 28 మంది నిజామాబాద్‌లో ఉన్నారన్నారు. అందుకే నిజామాబాద్ పార్లమెంట్ కార్యకర్తలకు ఎక్కువ పదవులు ఇవ్వాలని కోరారు.